ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక
Bullet Edition
మంగళవారం 10 డిసెంబరు 2024 www.prajaaswaramdaily.com 4 pm





## రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీతో మంత్రి సీతక్క భేటీ

న్యూఢిల్లీ : ఢిల్లీలోని పార్లమెంట్ ఆవరణలో రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీతో మంత్రి సీతక్క భేటీ అయ్యారు. రాష్ట్రంలో నెలకొన్న రాజకీయ పరిణామాలను, అమలవుతున్న సంక్షేమ పథకాలను రాహుల్ గాంధీకి వివరించారు. ఇటీవల వయనాడ్ ఎంపీగా గెలుపొందినందుకు గాను ప్రియాంకకు అభినందనలు తెలిపారు.

# రాష్ట్రపతి శీతాకాల విడిది ఏర్పాట్లు



### సీఎస్ శాంతికుమారి సమీక్ష

### 17 నుంచి 21 వరకు హైదరాబాద్ లో ఉండనున్న ముర్ము

హైదరాబాద్: శీతాకాల విడిదిలో భాగంగా రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము హైదరాబాద్ రానున్నారు. ఈనెల 17 నుంచి 21 వరకు రాష్ట్రపతి హైదరాబాద్‌లో ఉండనున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రపతి శీతాకాల విడిది ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో సీఎస్ శాంతికుమారి సమీక్ష నిర్వహించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో రాష్ట్రపతి పర్యటనకు ఏర్పాట్లు చేయాలని సీఎస్ ఆదేశించారు. బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. నిరంతరం అందుబాటులో ఉండేలా ప్రత్యేక బృందాలను నియమించాలని అటవీ శాఖ ఉన్నాతాధికారులను సీఎస్ ఆదేశించారు. హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవిగుప్తా, డీజీపీ జితేందర్, ఆర్అండ్ బీ ప్రత్యేక సీఎస్ వికాస్ రాజ్, అగ్నిమాపక శాఖ డీజీ నాగిరెడ్డి, జీఏడీ కార్యదర్శి రఘునందన్ రావు, సమాచార శాఖ ప్రత్యేక సీఎస్ హరీష్ తదితరులు సమీక్షలో పాల్గొన్నారు.

### అసెంబ్లీఆవరణలో ఫొటోలు,వీడియోలు

# తీయొద్దు




### హెచ్చరిక బోర్డులు ఏర్పాటు

హైదరాబాద్ : తెలంగాణ శాసనసభ ఆవరణలో ఫొటోలు, వీడియోలు చిత్రీకరణపై నిషేధం విధించింది. ఈ మేరకు శాసనసభ లాబీల్లో హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. కాంగ్రెస్ సర్కారు అసెంబ్లీ శీతాకాల సమావేశాల నేపథ్యంలో కొత్త నిబంధనలను తీసుకువచ్చింది. ప్రజా పాలన అంటూ ఎక్కడికక్కడ.. నిర్బంధకాండను అమలు చేస్తున్న సర్కారుపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# ఆశా వర్కర్ల తరఫున అసెంబ్లీలో నిలదీస్తాం

### మానవ హక్కుల సంఘం, మహిళా కమిషన్లో ఫిర్యాదు చేస్తాం

### మాజీ మంత్రి కేటీఆర్



హైదరాబాద్: హామీల అమలుకు ఆశా వర్కర్లు నిరసన తెలుపుతున్న వారిపై పోలీసులు దాడులు చేయడం హేయమైన చర్య అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. పోలీసుల దాడిలో గాయపడిన ఆశావర్కర్లను ఉస్మానియా ఆస్పత్రిలో పరామర్శించిన అనంతరం ఆయన మాట్లాడారు. కరోనా సమయంలో ప్రాణాలు సైతం లెక్కచేయకుండా ఆశావర్కర్లు సేవలందించారన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను గుర్తు చేసేందుకు ఆందోళన చేపట్టారన్నారు. ఈ ఘటనపై మానవ హక్కుల సంఘం, మహిళా కమిషన్‌లో ఫిర్యాదు చేస్తామన్నారు. ఆడబిడ్డలపై చేయి చేసుకున్న పోలీసులను డిస్మిస్ చేయాలని డిమాండ్ చేశారు. ఆశా వర్కర్ల తరఫున ప్రభుత్వాన్ని అసెంబ్లీలో నిలదీస్తామన్నారు. వారికి పూర్తిస్థాయిలో న్యాయం జరిగే వరకూ అండగా ఉంటాం అని కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు ఆశా వర్కర్లకు స్థిర వేతనం రూ.18 వేలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ గ్రామీణ ఆరోగ్య కార్యకర్తల సంఘం (బీఆర్‌టీయూ అనుబంధం) ఆధ్వర్యంలో సోమవారం జరిగిన ఆందోళనలు ఉద్రిక్తతకు దారితీసింది.

# తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఎందుకు ఏర్పాటు చేయలేదు

### ప్రజలకు బీఆర్ఎస్ సమాధానం చెప్పాలి

### మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్ : బీఆర్ఎస్ హయాంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఎందుకు ఏర్పాటు చేయలేదని మంత్రి పొన్నం ప్రశ్నించారు. ఆ పార్టీ ప్రజలకు సమాధానం చెప్పాలని అన్నారు. తాము తెలంగాణ తల్లి విగ్రహాన్ని మార్చలేదన్నారు. ప్రజల ఆంకాక్షలకు అనుగుణంగానే తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేశామని వెల్లడించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో పదేళ్లు పాటు తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేయకపోతే తాము కొత్తగా తెలంగాణ తల్లి విగ్రహాన్ని బహుజన భావంతోటి పెడితే బీఆర్ఎస్కు నచ్చకపోతే మేము ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఎన్నో నిరసనలలో చెప్పామని, మార్చుకున్నారా అని ప్రశ్నించారు. మేధావులు, కవులు, ప్రజల సూచనతోనే తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేశామన్నారు.



# రాజ్యసభ స్థానాలకు నామినేషన్లు

అమరావతి: ఏపీలో మూడు రాజ్యసభ స్థానాలకు కూటమి అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. టీడీపీ తరఫున బీద మస్తాన్ రావు, సానా సతీశ్.. బీజేపీ నుంచి ఆర్.కృష్ణయ్య నామినేషన్లు వేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్రాభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని చెప్పారు. తమకు అవకాశం ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలిపారు. రాజ్యసభ ఎన్నికలకు నామినేషన్లు దాఖలు చేసేందుకు మంగళవారమే చివరి రోజు. రాజ్యసభ సభ్యులుగా కృష్ణయ్య, మస్తాన్‌రావు, సతీశ్ ఎన్నిక లాంఛనమే.



# ధరూరులో రెవెన్యూ అధికారులపై ఆరోపణలు



గద్వాల్ : గద్వాల్ జిల్లా ధరూరులో రెవెన్యూ అధికారులపై ఆరోపణలు వెల్లువెత్తాయి. ఇనాం సీలింగ్ భూముల పట్టాలకు సంబంధించి ఫిర్యాదులు చేశారు. రాజకీయ పలుకుబడి ఉన్నవారికి పట్టా చేశారంటూ తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ను బాధితులు నిలదీశారు.

# అక్రమ నిర్మాణాల కూల్చివేత

పెద్దపల్లి: జిల్లా గోదావరిఖనిలో అక్రమ కట్టడాలను మున్సిపల్, రెవెన్యూ అధికారులు కూల్చివేస్తున్నారు. రోడ్డు విస్తరణలో భాగంగా సింగరేణి క్వార్టర్లను అధికారులు కూల్చివేస్తున్నారు. ఇందులో భాగంగా గోదావరిఖని ఓల్డ్ అశోక్ థియేటర్ ను, ఇండియా కూలర్స్ షాప్ షెడ్లును కూల్చివేస్తున్నారు. రాజకీయ బలంతో గత నెల రోజుల క్రితం అశోక థియెటర్ ను నేలమట్టం చేశారని ఇప్పుడు కూలర్ షాప్ ను కూల్చి వేస్తున్నారని లీజ్ హోల్డర్ అశోక్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆస్తిని ధ్వంసం చేసిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకునేందుకు కోర్టుకు వెళ్తానని తెలిపారు

